# సాగర 'మథనం'

వి. విజయలక్ష్మి

అర్థరాత్రి దాటింది. ఊరంతా ప్రశాంతంగా ఉంది. దూరం నుంచి టాంక్ బండ్ కింద రోడ్డు మీద వెళుతున్న లారీల శబ్దం ఆ నిశ్శబ్దంలో స్పష్టంగా వినిపిస్తోంది.

హుస్సేన్ భాయి ఇంటి దగ్గర పగలంతా సందడే. భరించలేనంత సందడి. రాత్రి వేళల్లో కూడా లారీలు రొదపెడుతూ నిద్ర పట్టనివ్వవు. ఎందుకు వాళ్ళ కీ నిరంతర శ్రమ? ఎవరి కోసం? ఏం సాధించాలని? ఏం సాధిస్తున్నారు? హుస్సేన్ భాయికి తెలిసినంతవరకు ఈ లోకంలో దుఃఖం తప్ప మరేమీ లేదు. అందరూ తనలాంటి అభాగ్యులే. చావలేక బ్రతుకుతున్న వాళ్ళూ, లేక బ్రతలేక చావు నాశ్రయిస్తున్న వాళ్ళు.

హుస్సేన్ ఇల్లు చాలా పెద్దది అనే కంటే దాన్ని పెద్ద లోగిలి అనవచ్చేమో. అతడేమో కదల్లేనివాడు, ఒంటరివాడు. అందుకే ఆ ఇల్లు రకరకాల జంతువులకి నిలయమైపోయింది. అత దెవ్వరినీ కసురుకోడు, తిట్టడు. అవి తన లోగిలిని ఆశ్రయంగా చేసుకున్నందుకు సంతోషిస్తాడు. అప్పుడప్పుడు పిల్లలు వచ్చి కేరింతలాడి వెళతారు. అప్పు డతనికి ఎంత సంబరమో!

అతడి బంధువు లెప్పుడూ రారు. కాని అనుకోని అతిథులు అప్పుడప్పుడు వస్తుంటారు. వాళ్ళని చూస్తేనే అతడికి బాధేస్తుంది. అందులో చాలామంది మరణానికి చివరి అంచున ఉన్నవాళ్ళే. జీవిత సమరంలో పోరాటం సాగిస్తూ చివరి మజిలీగా తన ఇంటినే ఎంచుకున్న వాళ్ళు చాలామంది అక్కడే ప్రాణాలు విడుస్తారు. అలా జరిగినప్పుడల్లా పోలీసులు, మునిసిపాలిటీ వాళ్ళు రావడం అంతా గొడవ, గందరగోళం. హుస్సేన్ భాయి స్థితిని తెలిసిన వాళ్ళు కాబట్టి అనుమానం అతడి మీదకు రాదు. లేకపోతే ఎన్నిసార్లు పోలీస్ స్టేషన్‌కి వెళ్ళవలసి వచ్చేదో!

హుస్సేన్ [illegible] అసహనంగా కదిలాడు. నిద్ర పోవాలంటే భయం. రకరకాల. పీడ కలలు వస్తుంటాయి. అవును మరి. మనిషి చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతూ, చివరి క్షణంలో బ్రతకాలని ఆశ పుట్టి మృత్యువుతో పోరాడుతూ, ఓడిపోయి ప్రాణాలు వదలడం కళ్ళారా చూస్తే అది జీవితమంతా వెంటాడే పీడకల. మరి అలాంటి మరణాలు అడపా దడపా చూస్తుంటే, అందులో సగంమంది తన [illegible]లోనే పడుకుని ప్రాణాలు వదిలితే, వదిలే ముందు తమ దీనగాథలు మళ్ళీ [illegible]పోతే అది అనుక్షణం వెంటాడే మనఃక్షోభ కదా. అందుకే అతడికి నిద్రంటే భయం.

ఇంటి నుండి బయటకు కదలలేని నిస్సహాయుడయినా హుస్సేన్‌కి చాలా విషయాలు తెలుస్తుంటాయి ఇంటికి వచ్చే అతిథుల ద్వారా. లోకంలో ఎన్ని అత్యాచారాలు జరుగుతున్నదీ, సమాజంలో ఎలాంటి కుళ్ళు ప్రవేశిస్తున్నదీ మనుషుల్లో స్వార్థం ఎంతగా పెచ్చుపెరిగిపోతున్నదీ వింటూ తల్లడిల్లిపోతాడు. ఒకసారి ఎంతో ఆవేశం వస్తుంది. ఈ సమాజం మీదకు దూసుకువెళ్ళి నిర్దాక్షిణ్యంగా అందర్నీ మట్టుపెట్టా లనిపిస్తుంది. బంధితమైన శరీరం ఆవేశాన్ని అణచివేస్తుంది. దుఃఖంలో మునిగిపోతాడు. 'మానవత్వం చచ్చిపోతూ, అమానుషత్వం దిన దిన ప్రవర్ధమాన మవడానికి కారణం ఏమిటి?' అతడి ఈ ప్రశ్నకు ఎవరూ సరయిన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. ఒకసారి ఒక మేధావి వచ్చాడు.

"ఇంత చదువుకున్నవారు, మేధావులు అయిన మీరు కూడా ఆత్మహత్య చేసుకుని చచ్చిపోవా లనుకుంటున్నారా?" హుస్సేన్ ఆశ్చర్యంగా అడిగాడు.

"నీ కీ లోకం సంగతి సరిగ్గా తెలియటం లేదు హుస్సేన్ భాయీ! నువ్వు చూసిన వాళ్ళంత కుటుంబ సమస్యలకు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడే వాళ్ళూ, కక్షల్లో ప్రాణాలు కోల్పోతున్న వాళ్ళూ, లేక దారిద్ర్యాన్ని భరించలేని వాళ్ళూ. కాని పైకి కనిపించకుండా మనుషుల్ని సాధించి, వేధించే శక్తులెన్నో ఉన్నాయి. వాటిల్లో 'బ్యూరోక్రసీ' ఒకటి" అన్నాడు మేధావి.

"ప్రజాస్వామ్య ప్రభుత్వం కదా! తమ అధీనంలో ఉన్న ప్రభుత్వ రంగాన్ని ప్రభుత్వమే అదుపులో పెట్టడం లేదంటారా?" అడిగాడు హుస్సేన్.

"అదుపులో పెట్టడమా? అసలు విజ్ఞాన రంగాన్ని ప్రభుత్వాధీనంలో ఉంచడమే తప్పంటాను. ఇక్కడ గొప్ప చదువులు చదివి అత్యున్నత పదవిలో ఉన్నవాడు, ఒక నిరక్షర కుక్షి అయిన మంత్రి కింద పని చేయాలి. ఏమాత్రం వ్యతిరేకించినా ముప్పతిప్పలు పెడతారు. కాబట్టి వాళ్ళ చేతిలో ఆట బొమ్మలా వ్యవహరిస్తాడు. దాంతో ఈ రంగంలో కూడా రాజకీయం ప్రబలిపోయి ఉంటుంది. తమ చెప్పు చేతల్లో ఉన్నవాడికే అన్ని సదుపాయాలు, ప్రమోషనులు. మా దగ్గర పని చేసే ఎంతోమంది సైంటిస్టులు బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకుంటుంటారు."


"కాని దీనికి పరిష్కారం ఆత్మహత్యే నంటారా? మీ జ్ఞానాన్ని మరో రకంగా దేశానికి వినియోగించగలిగే మార్గం లేదంటారా?"

"చాలామంది ఈ విషయం అర్థం కాగానే విదేశాలకు వెళ్ళిపోయారు. అక్కడ విజ్ఞాన శాస్త్రవేత్తలకు ఇచ్చే సదుపాయాలు, ప్రోత్సాహం ఇక్కడ లేవు. వాళ్ళకు అక్కడ కాస్త పేరు, ప్రతిష్ఠ రాగానే అప్పుడు వాళ్ళని గుర్తించి 'సైంటిస్టులంతా స్వదేశం వదలి వెళ్ళిపోతున్నారు' అని గోల పెడుతుంది ప్రభుత్వం. కాని నా దేశం, దేశభక్తి అని అలమటించే నాలాంటి వాళ్ళు ఇక్కడే ఉండి ఏదో చేద్దామని ప్రయత్నిస్తుంటే, ఎన్నో అవరోధాలు కల్పించి విసిగిస్తుంది, వాటినీ ఎదుర్కొని ఏదైనా సాధిస్తే దానికీ గుర్తింపు ఉండదు. కొద్దిగా ఎదిరిస్తే ఇదిగో ఇలా ఆత్మహత్యకు పాల్పడే పరిస్థితులు తెచ్చిపెడుతుంది."

"మీ కథ వినాలనుంది. చెప్తారా?" హుస్సేన్ ఆరాటంగా అడిగాడు.

మేధావి అప్పటికే సగం ప్రాణంతో ఉన్నాడు.

"చెప్తాను హుస్సేన్ భాయీ! పోలీసులకీ, ప్రభుత్వానికీ అవసరం లేని మరణ వాఙ్మూలం మీకు ఇస్తాను. నేను ఓ బీద కుటుంబంలో పుట్టాను. నాకు చదువంటే చాలా ఇష్టం. చదివించే తాహతు నా తండ్రికి లేదు. అందుకే నే నతడి మీద ఆధారపడలేదు. ఉదయం పేపర్లు, పాలు సప్లై చేసి, సాయంత్రం ఓ దుకాణంలో పని చేసి నా చదువుకి కావలసిన డబ్బు సంపాదించుకునేవాడిని. రాత్రివేళ వీధి దీపాల వెలుగులో చదువుకునే వాడిని. సెలవు రోజుల్లో ఏదో ఒక పని చేస్తుండేవాడిని. పదవ క్లాసు ఫస్టు క్లాసులో పాసయ్యాను. ఇంటర్‌లో స్కాలర్‌షిప్ వచ్చింది. అయినా పై పనులు చేయటం మానలేదు. ఇంటర్ కాలేజీ ఫస్టు రావడంతో మా ప్రిన్సిపాల్‌గారు నన్ను బాగా ప్రోత్సహించారు. నాకు సైన్సు చాలా ఇష్టమైన సబ్జెక్టు. అందులో



ఫిజిక్స్, కెమిస్ట్రీ రెండూ మరీ ఇష్టం. బి.ఎస్‌సి.లో చేరాను. చిల్లర పనులు మానేసి ట్యూషన్లు కుదుర్చుకున్నాను. అదృష్టవశాత్తు లెక్కలు, సైన్సు చెప్పే వాళ్ళకు మంచి డిమాండుంది. డిగ్రీ కూడా కాలేజీ ఫస్ట్ వచ్చాను. తరువాత డబుల్ పోస్టు గ్రాడ్యుయేషన్ చేశాను. నాకు ఇష్టమైన రెండు సబ్జెక్టుల్లో డిగ్రీలు తీసుకున్నాక డాక్టరేట్ చేయాలని నిర్ణయించుకున్నాను.

"అప్పట్నుంచే ఈ వ్యవస్థ నాకు అడ్డుపడటం మొదలయింది. నాకు పిహెచ్.డి. సీటు రాలేదు. ఓ మంత్రిగారి మేనల్లుడికి, మరో రిజర్వేషన్ అభ్యర్థికీ వచ్చాయి. నేను నిరాశపడలేదు. ఓ ఏడాది పాటు చిన్న ఉద్యోగం చేస్తూ కొన్ని వ్యాసాలు రాశాను. అవి మా ప్రొఫెసర్‌గారికి చూపించాను. చాలా బావున్నాయని, ఇంకా రాయమని ప్రోత్సహించారు. ఉత్సాహంగా మరి కొన్ని రాసి ఇచ్చాను. అవేవీ తిరిగి నా చేతికి రాలేదు. ప్రొఫెసర్‌గారి పేరున అచ్చయిపోయాయని, దానికి ఆయనకు మంచి ఫారిన్ ఛాన్సు దొరికిందని తరువాత తెలిసింది. నేను నిజం చెప్పినా నమ్మేవాళ్ళు లేరు. అధికారం ఉన్న వాడి మాటే చెల్లుతుంది. అది ఒక పాఠంగా తీసుకుని ఊరుకున్నాను.

"తరువాత సంవత్సరం పిహెచ్.డి.లో చేరాను. మూడేళ్ళలో డిగ్రీ వచ్చింది. ప్రభుత్వాధీనంలో ఉన్న సైంటిఫిక్ రీసెర్చి ఆర్గనైజేషన్‌లో మంచి ఉద్యోగం వచ్చింది. మా ఇంట్లో వాళ్ళకు నే నో మార్గదర్శి నయ్యాను. పెళ్ళి చేసుకొమ్మన్నా చేసుకోలేదు. నా జీవితం పరిశోధనకి అంకితం కావాలి. నా ప్రయోగం సామాన్య మానవుడికి ఉపయోగపడే ప్రక్రియ కావాలి. అదే నా ధ్యేయం. నేను కనుక్కున్న రెండు వస్తువులు సంఘంలో అతి బీదవాడికి ఉపయోగపడేవి. అవి - తక్కువ ధరకు ఎక్కువ కాలం మన్నే నాణ్యమైన బట్ట. నేను కనిపెట్టిన ఒక రసాయనిక చర్యని ఉపయోగించి బట్ట నేస్తే అది చాలా కాలం మన్నుతుంది. శరీరంమీద ఎలాంటి ప్రభావం చూపదు. మన దేశ వాతావరణానికి సరిగ్గా పనికొస్తుంది. ఆ ప్రయోగం ఫలించిన రోజున తెగ పొంగిపోయాను. ఎందుకంటే బీదవాడికి ఒక జత బట్టలు కొనుక్కోవడం అంటే ఎంత భారమో నాకు అనుభవపూర్వకంగా తెలుసు. తక్కువ ధరవి కొంటే త్వరగా చిరిగిపోవడం, ఖరీదైనవి కొనలేకపోవడం అనే బాధ లేదు. కాని నా ప్రయోగాన్ని ప్రభుత్వం ఆమోదించలేదు. దానివల్ల వేరే రకం జబ్బులు వచ్చే అవకాశం ఉందని చెప్పి దాన్ని పైకి రానివ్వలేదు."

"ఏం, ఎందుకని?" అడిగాడు హుస్సేన్.

"హుస్సేన్ భాయీ! ఈ ప్రభుత్వం ఎవరి చేతుల్లో ఉందనుకుంటున్నావు? ఉప్పు నుంచి విమానం వరకు తయారుచేసే అతి పెద్ద సంస్థలు, జేబు రుమాలు నుంచి నూటు బట్టలు నేసే మిల్లుల స్వంతదారులయిన కోటీశ్వరులమీద ఆధారపడి ఉంది. ఎన్నికల్లో వాళ్ళు ఈ పార్టీల కోసం కోట్లు ఖర్చు పెడతారు. తరువాత ప్రభుత్వం వాళ్ళకు అన్ని రకాలుగా సహకరిస్తుంది. నేను తయారుచేసిన మందు వాడితే బట్టలు చిరగవు. సేల్స్ తగ్గిపోతాయి. తగిన కారణం చూపకుండానే ప్రభుత్వం నా పరిశోధనని కాదనేసింది. నేను తరువాత కనిపెట్టిన సాధనం కల్తీలను కనిపెట్టేది. కేవలం ఏభై రూపాయలతో తయారయే ఈ పరికరం దగ్గరుంచుకొని మధ్య తరగతివాడు పాలనుంచి నూనెల వరకు, కారం, పసుపు లాంటి పదార్థాలలోనూ కల్తీని రెండు నిముషాల్లో కనిపెట్టగలడు. అతి తక్కువ ధరలో అందరికీ అందుబాటులో ఉండే ఈ పరికరం ఎంతోమందికి ఉపయోగపడుతుందని పొంగిపోయాను. దాన్నీ ప్రభుత్వం ఒప్పుకోలేదు. కారణం పైన చెప్పిన లాంటిదే.

"దాంతో నాలో ఉత్సాహమంత చచ్చిపోయింది. చివరి ప్రయత్నంగా నే నో పని చేశాను. నా ఫార్ములాలని ఇతర దేశాలకు పంపితే వాళ్ళయినా గుర్తిస్తారని, దానివల్ల అధిక జనం ఉపయోగించుకునే వీలుంటుందని భావించి ప్రభుత్వానికి తెలియకుండా రహస్యంగా పంపడానికి ప్రయత్నించాను. అదే నేను చేసిన పొరపాటు. నేను పని చేస్తున్న ఆర్గనైజేషన్ రహస్యాలను కోడ్‌లో పై దేశాలకు అమ్ముకోడానికి ప్రయత్నించానని నన్ను అరెస్టు చేశారు. దేశం కోసం అలమంటించిన నాకు 'దేశద్రోహి' అని బిరుదు నిచ్చారు. ఎన్ని విదేశీ అవకాశాలు వచ్చినా తిరస్కరించి నా దేశం కోసం నే నేదో చెయ్యాలని ప్రయత్నిస్తే నన్ను నలుగురిలో తలెత్తుకోకుండా చేశారు."


మేధావి వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. "నా పరిశోధనలను కాదన్న రోజున బాధ పడలేదు. కాని 'దేశద్రోహి' ననిపించుకోవడం నేను భరించలేకపోతున్నాను. నేను నిజం చెప్పినా ఎవరూ నమ్మరు. కనీసం నా పరిశోధనలని వాళ్ళ వారి పేరున విడుదల చేయించుకున్నా బాధపడేవాడిని కాదు. కాని ఈ 'ద్రోహం' నన్ను పిచ్చివాడిని చేసింది. ఇలా ఆత్మహత్య చేసుకోవడానికి కారణం అయింది!"


హుస్సేన్‌కి మేధావి హృదయం ఎంత సున్నితమయిందో అర్థం అయింది. వాళ్ళు దొంగ నేరాలు మోపి శిక్ష వేయకుండా తనను తాను శిక్షించుకున్నాడు. ఏమైనా ఈ దేశం ఓ మేధావిని కోల్పోతోంది. మేధావి ప్రాణం ఇంకా పోకముందే పోలీసులు వచ్చారు. కాని మేధావి వాళ్ళకు ప్రాణాలతో దొరకలేదు. అతడి శవాన్ని పోలీసులు తీసుకెళుతుంటే హుస్సేన్ నిస్సహాయంగా చూస్తుండిపోయాడు.

ఇది ఆత్మహత్య కాదు, హత్య! ఈ వ్యవస్థ తెలివిగా చేసిన హత్య. హుస్సేన్ భాయి గుండె ల్నెవరో బలంగా పిండుతున్నట్లు బాధ. అతడి కన్నీళ్ళు ఎవరికీ కనిపించనివి. అతడి బాధ ఏ ప్రభుత్వ యంత్రాంగానికీ వినిపించనిది. మేధావి జ్ఞాపకాలు అతడి గుండెలో మిగిలిపోయాయి.

** ** **

రెండు రోజులు గడిచాయి. ఆ రాత్రి అప్పుడే మాగన్నుగా నిద్ర పడుతోంది హుస్సేన్ భాయికి. ఎవరో వస్తున్న అలికిడి.




మేధావి జ్ఞాపకా లింకా వదలకముందే మరొకరా? ఈ వ్యక్తి ఎవరు? ఇతడి కథేమిటై ఉంటుంది? అడగ్గానే ఆ వ్యక్తి తన కథను వినిపించడం మొదలుపెట్టాడు. బహుశా తన బాధని చెప్పుకోవడానికి హుస్సేన్ భాయి లాంటి వా ళ్ళెవరూ తారసవడలేదేమో!

"నే నో ప్రభుత్వోద్యోగిని. నాకు అయిదుగురు పిల్లలు. నలుగురు అమ్మాయిల తరువాత పుట్టాడు వంశోద్ధారకుడు. పొంగిపోయాను. తాతలు సంపాదించిన ఆస్తి నా కేమీ లేదు. నా భార్యకి పెళ్ళిలో ఇచ్చిన రెండెకరాల పొలం అమ్మి చిన్న స్థలం కొనుక్కున్నాను. గృహ నిర్మాణ సంస్థ నుంచి అప్పు తీసుకుని ఇల్లు కట్టుకున్నాను. ఉండడానికి గూడు అయితే ఏర్పడింది. కాని ఒక్కడి జీతంమీద ఏడుగురు బ్రతకాలి. ఇంటి అప్పు తీర్చాలి. అదీగాక భార్యకి అనారోగ్యం. పిల్లలు పెద్దవాళ్ళవుతున్న కొద్దీ ఖర్చులు కూడా పెరగసాగాయి.

"ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు ఇవ్వకుండా పనులు జరగవని నీకు తెలుసుగా. లంచం తీసుకోవడం తప్పు. మొదట్లో భయపడేవాడినే గాని తరువాత అవసరం నన్ను జయించింది. మొదట్లో భయపడ్డాను గాని తరువాత అలవాటయిపోయింది. ఈ పై సంపాదనతో ఇంట్లో దేనికీ కొరత లేకుండా గడుస్తుపోయేది. పెద్దమ్మాయి ఇంటర్ పాసయింది. ఇంకా చదువుతానని గోల పెట్టింది. కాని నేనే వద్దన్నాను. చదువు ఎక్కువైన కొద్దీ వరుణ్ణి తెచ్చే భారం కూడా పెరిగిపోతుంది. అంతే కాకుండా వరసగా మరో ముగ్గురు ఆడపిల్ల లున్నారు. పెద్దమ్మాయికి సంబంధాలు వెతకడం మొదలుపెట్టాను. బజారులో వరుల రేట్లు ఎంత విపరీతంగా




పెరిగిపోయాయో చూస్తుంటే తల తిరిగిపోయింది. అతి మామూలు గుమాస్తా రేటు కూడా పాతికనుంచి ఏభై వేల వరకు ఉంది. ఆఫీసులో అన్ని రకాల లోన్లూ తీసుకున్నా ముప్ఫయి వేలకంటే మించవు. అది ఓ పిల్ల పెళ్ళికి ఖర్చు చేస్తే తరువాత వచ్చే నగం జీతంతో మిగతా వాళ్ళను సాకడం ఎలా?

"మా ఆఫీసరుని బ్రతిమాలుకుని పై సంపాదన కాస్త ఎక్కువగా దొరికే సీటుకి మార్పించుకున్నాను. ఆడపిల్లలు కలవాడినని ఆయన నా బాధ అర్థం చేసుకున్నాడు. ఆ తరువాత ధైర్యంగా సంబంధాలు చూడడం సాగించాను. ఓ సంబంధం కుదిరింది. అబ్బాయి బాంక్‌లో గుమాస్తా. పెళ్ళి ఖర్చు కట్నం నలభై వేలతో పాటు కలిపి డెబ్బయి అయిదు వేలు. పెళ్ళి ఆడంబరంగా జరిగింది. నా భార్య సంతోషానికి అవధులు లేవు. అబ్బాయి త్వరలో ఆఫీసర్ అయ్యే ఛాన్స్ కూడా ఉంది మరి. అయితే సంతోషం ఎంతో కాలం నిలవలేదు. హనీమూన్ వెళ్ళడానికి అయిదు వేలు కావాలని అడిగాడు అల్లుడు. ఇవ్వక తప్పింది కాదు. అది ప్రారంభం. అతడు, అతడి తల్లిదండ్రులు డబ్బుకి కక్కుర్తిపడే రకాలని త్వరలోనే తెలిసివచ్చింది. వాళ్ళ విషయం తెలిసిన వా ళ్ళెవరూ పిల్ల నివ్వడానికే ఇష్టపడలేదట. ఈ విషయం నన్ను బాగా భయపెట్టింది. పెళ్ళంటే చూసుకోవలసిన విషయాలు చాలా ఉంటాయని అర్థమైంది. దీపావళి మొదటి పండగ. స్కూటర్ కొనివ్వమన్నారు. తప్పలేదు. సంక్రాంతి పండగ వచ్చేసరికి అబ్బాయికి ప్రమోషన్ వచ్చింది. సూట్ కుట్టించమన్నారు. అదీ తప్పలేదు. ఉగాది పండక్కి వచ్చేసరికి అమ్మాయి సగం అయిపోయింది. అడిగితే వేవిళ్ళని చెప్పింది. కాని దాన్ని వాళ్ళెంత హింసిస్తున్నదీ తరువాత తెలిసింది. ఉగాది పండక్కి వీ.సీ.ఆర్. కొన్నాక అల్లుడు శాంతించి అమ్మాయిని తీసుకెళతా నన్నాడు.

"పిల్లలు కలవాడిని ఇక నా వల్ల కాదు బాబూ" అన్నాను.

"ప్రమోషన్ వచ్చాక పెళ్ళి చేసుకుంటే లక్ష రూపాయల కట్నం వచ్చేది. ఈ ముష్టి సంబంధం చేసుకున్నాం అని మా అమ్మ రోజూ అంటుంది. ఆవిడను సంతోషపెట్టడం నా బాధ్యత. అయినా మీ సీటు సంగతి నాకు బాగా తెలుసులెండి ఊరికే వచ్చేదేగా ఎందు-కీ బీద అరుపులు?" అన్నాడు.

నాకు భయం వేసింది. ఇది ఆరని నిప్పు, ఆగని బ్లాక్‌మెయిల్ అని తెలిసిపోయింది. ఒక్క కూతురు కోసమే ఇలా అయితే, మరో ముగ్గురి కోసం ఎన్ని లక్షలు సంపాదించాలి? అమ్మాయి పురిటికి వచ్చింది. సీమంతం అని అంతా తరలివచ్చారు. బోలెడు ఖర్చయింది. ఇక పురుడు తర్వాత ఖర్చు లెలా ఉంటాయో అని లంచాలు ఎక్కువగా తీసుకోవడం మొదలుపెట్టాను. అన్నింటికీ రేట్లు పెంచేశాను. దాంతో ఎవరో ఫిర్యాదు చేయడంతో నన్ను లంచం తీసుకుంటూండగా పట్టుకున్నారు. సస్పెండ్ చేశారు.

ఒకపక్క పరువు గంగలో కలిసింది. మరోపక్క భారం ఎక్కువైంది. అమ్మాయికి సిజేరియన్ ఆపరేషన్ - ఖర్చు నాలుగువేలు. రెండో అమ్మాయి పెళ్ళి కోసం ఉంచిన డబ్బులోంచి తీసి పాపకి గొలుసు, వెండిపట్టాలు, మొలతాడు చేయించాను. అయినా అత్తగారు రాలేదు. నా భార్య దిగులు ఎక్కువైంది. ఉద్యోగం తిరిగి వస్తుం దన్న నమ్మకం మాత్రం ఉంది. ఎందుకంటే నాతోపాటు బయటపడే ఆఫీసర్లు చాలామంది ఉన్నారు. వాళ్ళ గురించైనా నన్ను కాపాడటానికి ప్రయత్నిస్తారు అనుకున్నాను.

"దానికి తల్లి చాలు వచ్చింది. వరసగా ఆడపిల్లల్నే కంటుం దేమో! అక్కడే వదిలేద్దాం" అంటోం దట అత్తగారు. నా గుండెల్లో రాయి పడింది. ఈ పరిస్థితిలో మరో రెండు ప్రాణాలు భారమా? పులిమీద పుట్రలాగా ఉద్యోగం లోంచి తీసేస్తున్నారన్న వార్త. అందరూ కలసి నేరం పూర్తిగా నామీదే మోపేశారట. ఇక వేరే గత్యంతరం లేదు. డిస్మిస్ ఆర్డర్ ఫైనలైజ్ కాకముందే నేను పోతే, ఆ ఉద్యోగం నా రెండవ కూతురికైనా ఇస్తారు. కనీసం కడుపునిండా తిండైనా ఉంటుంది వాళ్ళకు. అల్లుడు జాలిపడి అమ్మాయిని తీసుకెళ్ళొచ్చు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను." కుటుంబరావు మరణం చివరి అంచున ఉన్నాడు.

హుస్సేన్‌కి అతడిని చూస్తే జాలి వేయడం లేదు. కోపం, అసహ్యం కలుగుతున్నాయి. ఆలోచనా రహితంగా ప్రవర్తించే ఇలాంటి మనుషుల వల్ల నష్టం ఎవరికి? తను చచ్చి బ్రతికిపోతాడు. బ్రతికి ఉన్న ఆ కుటుంబం గతేమిటి? తన సంపాదన ఎంతో తెలిసిన ఆ మహానుభావుడు అయిదుగురు పిల్లల్ని కనడం దేనికి? పాతిక సంవత్సరాలుగా కుటుంబ నియంత్రణ పథకాలు అమలులో ఉన్నాయి. ఆ మాత్రం జాగ్రత్త పడలేకపోయాడా? ఇతడి వంశాన్ని నిలబెట్టే వంశోద్ధారకుడి గతి రేపట్నుంచి ఏమిటి? ఒక పూట తిండైనా సరిగా దొరుకుతుందా? బ్రతికినంతకాలం వేరొకరి సానుభూతి ఆశిస్తూ, తప్పులు చేసి, అది పిల్లల కోసం అని సమర్థించుకుంటూ బ్రతికాడు. ఎంతమందిని వేధించి ఎన్నివేలు సంపాదించాడో. చేసిన పాపం ఊరికే పోదు. కాకపోతే దానికి ఫలితం ఆ భార్యా పిల్లలు అనుభవిస్తున్నారు. ఇంత చేసీ ఓ కూతురి కాపురం సరిచేయలేకపోయాడు. తను తప్పుడు పనులు చేసేవాడు కాబట్టి, అల్లుడి దొంగతనాల గురించి కంప్లెయింట్ ఎలా చేస్తాడు? అదే ఆ అమ్మాయి తన కాళ్ళ మీద తను నిలబడేలా సహాయం చేశాక పెళ్ళి చేసి ఉంటే, ఇప్పుడు తన బ్రతుకు తను బ్రతికేది. ఆడపిల్ల అనగానే 'పెళ్ళి' అని తప్ప మరో ఆలోచన లేని కుటుంబరావులు బాగుపడరు.

ఇద్దరు పిల్లలకంటే ఎక్కువ కనరా దనే ఆంక్ష ప్రభుత్వం పెట్టనంతకాలం ఈ కుటుంబరావుల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. ప్రభుత్వానికి ఓట్లు కావాలి. మైనారిటీల ప్రాపకం కావాలి. కానీ దేశ సౌభాగ్యం అవసరం లేదు. వనరులు తక్కువ, జనాభా ఎక్కువ. వనరులు అయిదు శాతం పెరిగితే గొప్పగా చెప్పుకుంటారు. జనాభా ఇరవైశాతం పెరుగుతోందని భయపడరు. ఈ దేశ భవిష్యత్తు ఏమిటి? హుస్సేన్ బాధగా కళ్ళు మూసుకున్నాడు. కుటుంబరావు ప్రాణం గాల్లో కలిసిపోయింది.

** ** **

హుస్సేన్ భాయి ఈ రోజంతా ఏడుస్తూనే ఉన్నాడు. క్రితం రాత్రి వచ్చిన యువకుడు అతడి బాధకు కారణం. పాతికేళ్ళయినా ఉన్నాయో, లేదో బ్రతకాలని ఎంత తపన! పాపం! అతడి ఆత్మహత్యకు కారణం ఏమిటి? చాలా ఎత్తు మీద నుంచి దూకాడల్లే ఉంది - తల పగిలింది. మాట్లాడే స్థితిలో లేడు. అలాగే లోగిట్లోకి వచ్చాడు. చావుతో పోరాడి పోరాడి అలసిపోయిన తన ఒడిలోనే ప్రాణాలు వదిలాడు. అప్పటికే లోగిలంతా రక్తం పరుచుకుపోయింది. హుస్సేన్ భాయి శరీరం నిండా రక్తమే.

అతడు దుఃఖం నుంచి తేరుకోకముందే వచ్చిం దో అమ్మాయి. ఇరవైఏళ్ళుంటా యేమో. చదువుకున్నదానిలాగా ఉంది. "ఇక్కడ, ఇక్కడేనా తాతా నా చైతన్య అచేతనుడైంది? చెప్పు తాతా. చివరి మాటగా ఏం చెప్పాడు?" విలపిస్తోంది.

"ఎవరమ్మా నిన్న రాత్రి వచ్చిన యువకుడి గురించేనా ను వ్వడిగేది?"

"అవును తాతా! రాత్రి ... " దుఃఖం ఆమె మాటను మింగేసింది.

"పాపం! ఏమీ చెప్పలేకపోయా డమ్మా! పెద్ద ప్రమాదమే అనుకుంటా. తల పగిలింది. నా ఒళ్ళోనే ప్రాణం విడిచాడు."

"ప్రమాదం కాదు తాతా! అది హత్య. అమానుషంగా, నిర్దాక్షిణ్యంగా చేసిన హత్య" అంది ఏడుస్తూ.

"హత్యా? ఎవరు చేశారు? నువ్వు చూశావా?" ప్రశ్నల వర్షం కురిపించాడు హుస్సేన్.

"కళ్ళారా చూడలేదు తాతా! చూస్తే అతడిని కాపాడుకునేదాన్ని. చేసింది మా నాన్నగారి దగ్గర కుక్కలా పడుండే ఓ వస్తాదు. చంపించింది అక్షరాలా నా తండ్రి."

"మీ నాన్నగారా! ఎందుకు? చైతన్య నీకు బాగా తెలుసా?"

"తెలుసా ఏమిటి తాతా! చైతన్య నా ప్రాణం. అందుకే అతడి ప్రాణం తీశారు. వాళ్ళను ఏ చట్టమూ శిక్షించదు. అందుకే నా చైతన్య పోయిన స్థలంలోనే ఆత్మహత్య చేసుకోవాలని వచ్చాను. నా ఆత్మహత్యకు కారణం ఏమిటో దేశం అంతా తెలిసేట్లు వార్తాపత్రికలకు వివరంగా రాసి ఇచ్చి మరీ వచ్చాను. నా చావే నా తండ్రికి శిక్ష." ఆవేశంగా అంది.

ఆమెలో శక్తి నన్నగిల్లిపోతోంది. హుస్సేన్ బాధగా ఆమెను ఒడిలోకి తీసుకున్నాడు. "ఎందుకమ్మా అతడి మీద మీ నాన్నకు అంత కక్ష? డబ్బు లేదనా, కులం లేనివాడనా?" అవి రెండే కారణాలు హుస్సేన్‌కి తెలిసినవి, పెళ్ళికి పెద్దవాళ్ళు పెట్టే అభ్యంతరాలు.

"రెండూ కాదు. చైతన్య నాకు బంధువే. నాకు వరసైనవాడే. చిన్నప్పటి నుంచి కాబోయే భార్యాభర్తల మని మమ్మల్ని గేలిచేసి, మాలో ఆశలు రేపి పెట్టారు. బావను నేను మనస్ఫూర్తిగా ప్రేమించాను. అతడికి నే నంటే ప్రాణం."

"మరైతే అతడిని చంపాల్సిన అవసరం? కుటుంబ కలహా లొచ్చాయా?"


"ఏదీ కాదు తాతా! రాజకీయం. మా తండ్రి ఇరవై ఏళ్ళుగా మా ఊరిని ఏలుతున్న మహారాజు. ఎలక్షన్లో ఆయన్ని ఎదిరించేవారు లేరు. అలాంటి అభిప్రాయం ఉందని తెలియగానే నానా రకాలుగా హింసించి వారంతట వారే ఆ ఉద్దేశం మార్చుకునేలా చేసేవాడు. దాంతో ఆ నియోజకవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వచ్చాడు. అయితే ఆయనది రామరాజ్యం కాదు. వచ్చి నిరంకుశత్వం. ప్రతిదానికీ దండప్రయోగమే. ఆయన దగ్గర పదిమంది వస్తాదు లున్నారు. వాళ్ళు ఆయన పెట్టిన ఖరీదైన తిండి తిని, తాగి కండలు పెంచి సామాన్యుల మీద అధికారం చెలాయిస్తారు. ఆయన సంపాదనకు అంతులేదు. హైదరాబాదులోనే నాలుగు ఇళ్ళున్నాయి మాకు. మా ఊరి చుట్టుపక్కల పొలాలన్నీ మావే.

"మాకు అన్ని వసతులూ ఉన్నాయి. కాని మా ఊళ్ళో ప్రజలు తినే తిండి కల్తీ, తాగే నీళ్ళు కల్తీ, పొలాలకు వేసే మందులు కూడా కల్తీ. మా పొలాల్లోనే పంటలు బాగా పండటం, వాళ్ళవన్నీ పాడవటం ఎందుకో మాకు అర్థమయ్యేది కాదు. కాని బావ నిజం తెలుసుకున్నాడు. నాన్న సప్లై చేసే వస్తువులన్నీ కల్తీవి. ఆ రకంగా వాళ్ళను బలహీనులను చేసి, సహాయం చేసినట్లు నటించి, అధికారం పకడ్బందీ చేసుకుంటున్నాడు. ఇవన్నీ తెలియగానే బావ సహించలేకపోయాడు. ఊళ్ళో యువకులను సమీకరించుకున్నాడు. మా నాన్న అఘాయిత్యానికి గురవుతున్న స్త్రీలు, రైతులు వాళ్ళకి మద్దతు నిచ్చారు. ఒక్కొక్కటిగా నాన్న చేసే పనులన్నీ బయటపెట్టసాగారు. బావ నాన్నకి ప్రతిపక్షంలో చేరిపోయాడు. ఎన్నికలలో నిలబడబోతున్నాడు.

"మొట్టమొదటిసారిగా నాన్నకు భయం పట్టుకుంది. ఊళ్ళో చూస్తే జనం తనకు ఎదురు తిరిగేలా ఉన్నారు. బావలాంటి యువకుడి చేతిలో ఓడిపోతే ఇక తలెత్తుకోలేడు. ఆయన సామ, దానాలను ఉపయోగించాడు.

"న న్నిచ్చి వెంటనే పెళ్ళి చేస్తా నన్నాడు.

"బావ నవ్వాడు. 'ను వ్విచ్చే దేమిటి? రూప నన్ను ప్రేమించింది. నువ్వు కా దన్నా నీ ఇంట్లోంచి వచ్చి నన్ను పెళ్ళి చేసుకుంటుంది' అన్నాడు. ఆస్తి పోతుందని భయపెట్టాడు నాన్న 'నువ్వు అక్రమంగా సంపాదించిన ఆ ఆస్తి మాకు అవసరం లే' దన్నాడు బావ. నాన్నకి కోపం వచ్చింది. నేను అంతపనీ చేస్తా నని కూడా ఆయనకు తెలుసు. అందుకే గూడుపుఠాణీ చేసి బావను ఒంటరిగా తీసుకొచ్చి వస్తాదులతో తల పగులకొట్టించి ఇక్కడ పడేశారు. నా వాళ్ళకు తెలుసు. ఆ విషయం వాళ్ళు మాట్లాడుకోవటం వినగానే నేను వచ్చేశాను. నాన్న అక్రమాలు, వాటికి రుజువులు, బావ హత్య - అన్నీ పేపర్లకు వివరంగా ఇచ్చేసి నీ దగరకు వచ్చేశాను." రూప ఆయాసంతో




ఆగింది. ఆమె కళ్ళు మూతలు పడుతున్నాయి. నిద్రమాత్రలు మింగినట్లుంది.

హుస్సేన్‌కు ఆమెను కాపాడే మార్గం తెలియదు. నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాడు.

"తాతా! ఈ రక్తం బావదే కదూ! నీ శరీరంలో ఒక భాగమైపోయింది. నన్నూ నీ ఒడిలోనే పోనీయ్ తాతా!" ఏడవటానికి కూడా ఓపిక లేనట్లుగా ఆమె అతడి ఒడిలో వాలిపోయింది. ఆమె కళ్ళు శాశ్వతంగా మూతపడిపోయాయి. ఒక రకంగా తృప్తిగా ప్రాణాలు వదిలింది.

హుస్సేన్ గుండె చెరువైపోయింది. ఆవేశంతో ఎగిరెగిరిపడ్డాడు. అంతలో అవే నిస్సహాయత, నిస్తేజం అవరించుకున్నాయి. ఆవేశం అంటూ రగిలితే ఈ చెర నుంచి బయటపడి తన వాళ్ళందరినీ కూడగట్టుకోగలిగితే, ఈ వ్యవస్థను సమూలంగా నాశనం చేయగలడు. తన ధాటిని ఆపగలిగే శక్తి ఏ శ్శవరికీ లేదు. వాళ్ళకూ ఆ విషయం తెలుసు. అందుకే అవిటివాడిని చేసి, కదలకుండా కట్టిపడేశారు. పైకి నీతులు చెపుతూ తనలో కలుషితమైన మందుల్ని ఇంజక్ట్ చేస్తున్నారు. రోజు రోజుకీ తనను నిస్సహాయుడిగా చేస్తున్నారు. తన లోగిట్లో కలుస్తున్న ఈ కాలుష్యంతో తన ఆశ్రయంలో ఉన్న జంతువులు కూడా నిస్సహాయంగా చచ్చిపోతున్నాయి.

వీళ్ళ ఆంతర్యం ఏమిటో అర్థం కాదు. వేలు, లక్షలు ఖర్చుపెట్టి విగ్రహాలు చేయించి, పూజలు చేసి తెచ్చి తన లోగిట్లో పడేసిపోతారు. ఒకటా, రెండా వేలకొద్దీ వినాయక విగ్రహాలు. ఇప్పుడు కొత్తగా ఆదిశక్తి దుర్గ విగ్రహాలు కూడా వచ్చి పడుతున్నాయి. ఈ కాలుష్యాన్ని భరించలేక తను క్రుశించిపోతున్నాడు. వాళ్ళకు తెలుసు - ఇ దిలాగే సాగితే అందమైన ఈ లోగిలి నేలమట్టం కాగలదు. తన ఆశ్రయం కోరి వచ్చేవారు మరో లోగిలి వెతుక్కోక తప్పదు.




హుస్సేన్‌కి అందరూ గుర్తొస్తున్నారు. ఈ వ్యవస్థలో బ్రతకలేక చచ్చిపోయిన మేధావి, మూర్ఖత్వంలో అయిదుగురు పిల్లల్ని కని అందరి బ్రతుకులూ నాశనం చేసిన కుటుంబరావు, రాజకీయాలకు బలైపోయిన ఈ జంట - వీరందరి చావుకూ ఈ వ్యవస్థే కారణం. తమకి ఓట్లు కావాలని జనాభా పెరుగుదలను ప్రోత్సహిస్తున్న రాజకీయ నాయకులు ఒక పార్టీ అని కాదు - ఎవరు చూసినా స్వార్థపరులే. అధికారం కోసం తోటి మనుషులను హత్య చేసే రాజకీయం. తమ జేబులు నింపుకోవడానికి దేశాన్నే అమ్ముకుంటున్న స్వార్థ రాజకీయం. పైకి మాత్రం మొసలి కన్నీళ్ళు, తన పట్ల సానుభూతి, ప్రేమ. ఈ మధ్య ఉన్న ఈ లోగిట్లో బుద్ధభగవానుని నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారట. అమాయకుల శవాలు, వారి రక్తం కలిసిన ఈ మట్టిని పునాదిగా చేసి కరుణామయుడిని నిలబెడతారట. ఎందుకాయనకీ శిక్ష? ఈ అత్యాచారాలన్నీ చూసి ఆ అహింసావాది కూడా కుమిలిపోవాలా?

అనుకోని ఈ అతిథి రాక హుస్సేన్‌ని సంభ్రమంలో ముంచేసింది. తన ఆరాటాన్నీ ఆవేదననీ పంచుకోవడానికి సాక్షాత్తు బుద్ధ భగవానుడే తన లోగిట్లోకి వచ్చేశాడు.

"స్వామీ ... మీరు కూడా?"

"ఏం హుస్సేన్! వేలాది విగ్రహాలతోపాటు నేనూ అనుకోకూడదా?" నవ్వాడు బుద్ధుడు.

"స్వామీ! ఈ స్వార్థ కలుషిత సమాజంలో ఇమడలేక మీరు కూడా ఆత్మహత్య చేసుకుంటున్నారా లేక ఇది హత్యా?" అడిగాడు హుస్సేన్.

"రెండు రాజకీయపార్టీల చదరంగపు ఆటలో వేసిన ఎత్తు లివి హుస్సేన్! నాకు చావు లేదు. ఈ నీటి మీద నిలబడి ఉన్నా నీ లోగిట్లో తల దాచుకున్నా - ఆ దీనుల ఆక్రందనలు నాకు చేరుతూనే ఉంటాయి. నే నెక్కడున్నా ఒకటేలే" అన్నాడు.

హుస్సేన్‌కి బాధ కలిగింది. ఏమిటీ రాజకీయం? ఇలాంటి మనుషులను చూసే కాబోలు ఎవరో కవి అన్నాడట - 'నీతుల రెండు నాల్కలు సాచే నిర్హేతుక కృపా సర్పాలు' అని.

హుస్సేన్‌భాయిలో దుఃఖం పొంగి పొర్లుతోంది. కోపంతో గుండె కుతకుతలాడుతోంది. నిస్సహాయత కన్నీటి సాగరంలో ముంచుతోంది. లోగిలంతా నీటిమయమే. అతడి పేరులో సాగరం ఉంది కానీ, అతడి గుండెల్లో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి. అది నిజం.

నమ్మలేకపోతున్నారా? అయితే ఈసారి టాంక్‌బండ్ మీద నిలబడి కింద ఆవేశంతో ఊగిపోతున్న హుస్సేన్‌ని ఒకసారి పరిశీలించండి. ఆ అలల మధ్య హుస్సేన్ మీకు కనిపిస్తాడు. మురికి పట్టిన శరీరంతో, హృదయవిదారకంగా ఏడుస్తూ, తన లోగిలిలో కలిసిపోయిన రక్తాన్ని ఇంజెక్ట్ చేస్తున్న కలుషితాన్ని మీ దృష్టికి తేవాలని ఆరాటపడుతూ, తన మనసును మీకు విప్పి చెప్పుకోవాలని శ్రమపడుతూ, తనను బందీ చేసిన అడ్డుగోడని పడగొట్టడానికి ప్రయత్నిస్తూ - రకరకాల భావాల్లో కనిపిస్తాడు.

అతడిని చూసి జాలిపడి ఒక కన్నీటి బొట్టు విడవండి. ఆ కన్నీరే అతడి హృదయతాపాన్ని ఆర్పగలదు. ఆ కన్నీటి ధారలే అతడిలో సంతోషాన్ని కలిగించగలవు!

★